చిన్న - పెద్ద

[కథానిక]

= శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి =

వెంకట్రామయ్య ఇల్లు చేరుకునేటప్పటికి పొద్దు కూకింది. కాంతారావు వున్న భాగం వరండాలో హరికేనులాంతరు చిన్నది చేసివుంది. ఇంట్లోకి వెళ్లి వుత్తరీయం అవతల పారేసి, బైట లష్టరుదీపం కొంచెం తగ్గించి, అరుగుమీద వున్న పడకకుర్చీ తీసి కింద వేసి, దాంట్లో కూచుని చుట్ట వెలిగించాడు వెంకట్రామయ్య. ఎదురుగుండా వున్నవారి దొడ్లోవున్న బాదంచెట్టుఆకుల సందునుంచి చందమామ కనపడీకనపడకుండా వున్నాడు.

"ఏమోయి తమ్ముడూ!" అన్నాడు వెంకట్రామయ్య — అప్పుడే వచ్చిన జగన్నాథం హరికేనులాంతరు పెద్దదిచేసి, పక్కన వున్న పుస్తకం తెరవగానే.

జగన్నాథం కాంతారావుకొడుకు. తొమ్మిదేళ్లుంటయి. కాంతారావుఇంట్లో వెంకట్రామయ్య అద్దెకుంటున్నాడు. వెంకట్రామయ్య పిలవగానే జగన్నాథంలేచి నిల్చున్నాడు.

"భోంచేశావా?"

"ఆ!" అన్నాడు జగన్నాథం.

"అప్పుడే! నాకు పెట్టకుండానే భోంచేశావే!" అన్నాడు వెంకట్రామయ్య ఆశ్చర్యం కనపరుస్తూ. జగన్నాథం మాట్లాడకుండా అక్కడే నిల్చున్నాడు.

"ఇక్కడికి రావోయి-పిలుస్తుంటేనే!" జగన్నాథం వెంకట్రామయ్య దగ్గిరికి వచ్చాడు.

"అన్నంలో ఏమేసుకు తిన్నావ్?"

"కందిపచ్చడీ—మరి—"

"కందిపచ్చడే—మరి నాకు పెట్టకుండానే తిన్నావే?"

జగన్నాథం మాట్లాడలేదు.

"పోనీ, ఈతడవ కందిపచ్చడి చేసుకున్నప్పుడు పెడతావా ?"

జగన్నాథం మాట్లాడలేదు.

"ఓరి! ఈ తడవ చేసుకున్నా పెట్టనన్నమాట! ఏమండోయి, మీ మనమడు కాస్త కందిపచ్చడికూడా పెట్టట్ట!" అన్నాడు వెంకట్రామయ్య అప్పుడే వచ్చి వాకిట్లోకూచున్న శేషమ్మతో.

"వాడా-వొట్టిబడితె! పోయి చదువుకోరా!" అంది శేషమ్మ.

"అయితే నువ్విప్పుడేం చదువుతున్నావురా జగన్నాథం?" అన్నాడు వెంకట్రామయ్య.

"అయిదో క్లాసు!" అన్నాడు జగన్నాథం.

"ఇంతే—ఏదీ, నువ్వు చదివే పుస్తకం పట్టుకురా!"

జగన్నాథం పుస్తకాల దగ్గిరికి వెళ్లాడు.

"నాన్నగారూ, అమ్మ మడిగట్టుకోమంటున్నది" అంటూ వచ్చాడు వెంకట్రామయ్యకొడుకు శివరాము.

"అలాగేలే – వస్తున్నానుండూ!" అన్నాడు వెంకట్రామయ్య.

"అదేమిట్రా, ఆయన పిలుస్తుంటే వెళ్లకుండా అలా మొద్దల్లే కూచున్నావు!" అంది శేషమ్మ మనమడితో.

"నేను చదువుకోఅక్కర్లేదేమిటే!" అన్నాడు జగన్నాథం.

"ఏడిచినట్టే వుంది నీచదువు — ఆయన పిలుస్తుంటే వెళ్లవేం? మావాడు వట్టి బడిత అయిపోతున్నాడు బాబూ — చదువని పేరేగాని వాడు చదివే దానికీ, వాడికి అర్థంఅయేదానికీ సంబంధం వుండదు. ఏమిటో మనస్సులో చదువుకుంటాడు. చూడరా వెధవా, వాళ్ల శివరాము ఎలా చదువుతున్నాడో గడగడా!" అంది శేషమ్మ లేచి వెళుతున్న జగన్నాథంతో, అప్పుడేవచ్చి వరండాలో కూచుని చదువుతున్న శివరామును చూపి.

"అయితే మీ పరీక్షలు జరుగుతున్నయ్యా?" అన్నాడు వెంకట్రామయ్య జగన్నాథం దగ్గిరికి రాగానే.

"ఆ!" అన్నాడు జగన్నాథం.

"రేపు ఏమిటి?"

"జాగ్రఫీ"

"అయితే మన దేశం దేన్ని పండించటంలో ప్రసిద్ధి?" అన్నాడు వెంకట్రామయ్య.

జగన్నాథం మాట్లాడలేదు.

"చెప్పరా మొద్దూ!" అంది శేషమ్మ.

"ఏమిటి మా వాడిని పరీక్షచేస్తున్నారా?" అన్నాడు కాంతారావు అప్పుడే వచ్చి.

"నువ్వు భోజనానికి లేవరా అబ్బాయీ!" అంది వెంకట్రామయ్యతల్లి రాజమ్మ వచ్చి గడపలో కూచుని.

"ఒరేయి, ఇటురా జగ్గూ!" అంది జగన్నాథం తల్లి దొడ్లోనించి. జగన్నాథం వెళ్లాడు.

"అదీ! ఎప్పుడు ఎవరు పిలుస్తారా అని సిద్ధంగా వున్నాడు వెధవ — ఆయ నడిగిందానికి సమాధానం చెప్పవేం?" అంది లోపలికి పోతున్న జగన్నాథాన్ని చూచి శేషమ్మ.

"నీకెందుకేం?" అన్నాడు జగన్నాథం.

"అంతేలే, ఆయనకొడుకువు గాదూ నువ్వు?" అంది శేషమ్మ.

"ఏమిటది మధ్య నన్ను ఇరికిస్తున్నావు!" అన్నాడు కాంతారావు తల్లితో.

"ఏంలేదు— వాడుకూడా నీకుమల్లేనే తయారవుతున్నాడని అన్నా. వాడినేం తిట్టలేదు!" అంది శేషమ్మ.

"నాకుమల్లే తయారుకాకుండా చెయ్యరాదూ వాడిని?" అన్నాడు కాంతారావు.

"నిన్ను చేశాను; వాడిని చేస్తాను ఇక!" అంది శేషమ్మ.

"అలాంటప్పుడు మరి అనుకోవటం దేనికి?" అన్నాడు కాంతారావు.

"ఏమో నాయనా, పెద్దదాన్ని కనక అనుకుంటాను" అన్నది శేషమ్మ.

"నాన్నగారూ, అమ్మ,మడిగట్టుకోవచ్చునంటున్నది!" అన్నాడు జగన్నాథం దబదబా వచ్చి.

"చంపుతా వెధవా నన్ను నాన్నగారూ అని పిలిచావంటే- నీ కిదివరకు ఎన్నోసార్లు చెప్పాను!"

"అదికూడా తప్పేనుట్రా?" అంది శేషమ్మ.

"వాడు చేసే పన్లు అన్నీ తప్పేగా నీ దృష్టిలో! నాన్నగారుట నాన్నగారు—-ఎక్కడ నేర్చుకున్నాడో!"

"ఇది మరీ బాగుందిరా!" అన్నది శేషమ్మ.

"నీ మనమడిమీద నీకున్న ప్రేమ నా కొడుకు మీద నాకు లేకపోలేదు లేవమ్మా- ఈ విషయంలో నువ్వు వాడిని వెనకేసుకుని రా నక్కర్లేదు." అన్నాడు కాంతారావు.

"నేను వెనకేసుకుని వస్తే సాగుతుందిట్రా పిచ్చివాడా. వాడికిప్పుడే నేనంటే లక్ష్యం లేదు." అంది శేషమ్మ.

“మరి నేనంటే లక్ష్యముందేం?” అన్నాడు కాంతారావు.

“ఏదీ నీ ఎదటే - నువ్వటు మొహం తప్పిస్తే వాడిటు మళ్ళీ మామూలే. మరి నువ్వు వున్నా నేనంటే వాడికి లక్ష్యం లేదు సరేగదా!” అంది శేషమ్మ.

“అదికూడా నా తప్పేనా? వాడిని అలా చేసింది నువ్వు!” అన్నాడు కాంతారావు.

“చివరకు నేరం నామీదే పెట్టావూ — అంతేలే. నువ్వు అంతకంటె మరేమంటావు!” అన్నది శేషమ్మ.

“నే ననేదేమిటి? నేనంటే వాడికి లక్ష్యం ఎందుకుండాలి–నువ్వంటే ఎందుకు ఉండకపోవాలి?” అన్నాడు కాంతారావు.

“నామాటంటే వాడు ఒక్కపిసరు లక్ష్యం చెయ్యకుండా వున్న సమయాల్లో నువ్వు వాడిని ఒక్కసారన్నా కోప్పడితేగా వాడికి లక్ష్యం ఉండటానికి?” అంది శేషమ్మ.

“ఇది మరీ బాగుంది! నువ్వంటే వాడికి అసలు లక్ష్యం లేని స్థితి ఎందుకు రావాలి?”

“ఏమో నాకేం తెలుసు?” అంది శేషమ్మ.

“నీకు తెలిసిందల్లా వాడు అయిదోఏటనే నలభయ్యేళ్ళవాడిమాదిరిగా వుండలేదనేగా?” అన్నాడు కాంతారావు.

“ఇంకా రెండేళ్లు తగ్గించు. రేపు వైశాఖమాసానికి నీ ముద్దులకుమారుడికి పదోఏడు వస్తుంది. అప్పుడే మరిచిపోయినట్టున్నావు!” అంది శేషమ్మ.

“వాడు నీతో మర్యాదగా వుండనిది ఇవాళ్ల కాదుగా-ఈ నాలుగేళ్లమట్టీ వాడు నీతో పెంకిగానే వుంటున్నాడుగా. నువ్వూ మరిచిపోయినట్టున్నావు!” అన్నాడు కాంతారావు.

“వాడి ఎదటే వాడిని ఇలా వెనకేసుకొస్తే పెంకిగా వుండకేం చేస్తాడు?” అంది శేషమ్మ.

“వెనకేసుకుని రావటం తప్పుగాదుకాని వాడి ఎదటే ఆపని చెయ్యటం తప్పుకామాలు!” అన్నాడు కాంతారావు.

“నాయనా, నీకొడుకుని నీయిష్టం వచ్చినట్టు పెంచుకో. ఏదో పెద్దదాన్నికాబట్టి వాడింత చదువుకుని బాగుపడాలని నాకుంటుంది. నువ్వు అక్కర్లేదన్నా వుంటుంది. అనుకోటమేకాని నేననుకున్నట్టు ఎలా జరుగుతుందీ? వాడు నీకొడుకాయె-నువ్వెంతో వాడూ అంతే. నీ కెంత లక్ష్యం వుందో వాడికీ అంతే వుంటుంది. నామాట నువ్వెంత విన్నావో వాడూ అంతే వింటాడు!” అంది శేషమ్మ.

“నా చిన్నప్పటి సంగతులు తప్ప నావిషయం నీ కింకేమీ జ్ఞాపకం లేదల్లే వుంది?” అన్నాడు కాంతారావు.

“ఎలా మరిచిపోతానూ? నీ పుత్రుడు ఒకొక్కపని చేస్తుంటే నీవు చేసిన పనులు కళ్లకుకట్టినట్టు వుంటయి. నువ్వు లేకపోతే వీడు నన్నెంత ఏడిపించేదీ నీకేం తెలుసు, గోడలూ చెట్లూ ఎక్కటం మొదలైన సకలవిద్యలూ నీకుమల్లేనే తెలుసు—”

“నాన్నా, భోజనానికి రమ్మంటున్నది అమ్మ!”

కాంతారావు లోపలికి వెళ్లాడు. కాంతారావుతో జగన్నాథంకూడా వెళ్లాడు.

“ఏం రాజమ్మగారూ, మీ ఇంట్లో భోజనాలయినయ్యా?” అంది శేషమ్మ.

“ఏదీ, మావాడు భోజనం చేస్తున్నాడు” అన్నది రాజమ్మ.

“మా కాంతారావు ఇప్పుడింకా నయం. వాడు చిన్నప్పుడు చేసిన గోల భగవంతుడికి తెలుసు” అంది శేషమ్మ.

“ఆ. చిన్నతనంలో అల్లరి పెద్దతనంలో వుంటుందిటండీ మీకు మరీ చాదస్తంగాని!” అంది రాజమ్మ.

“మీమనమడూ, కొడుకూ చూడండి — వాళ్లు ఎలా వుంటారో?” అన్నది శేషమ్మ.

"మా వెంకట్రాముడు చిన్నప్పుడు ఒకచోట కూచోపెడితే అలా కదిలేవాడుకాదు!" అంది రాజమ్మ.

"అదృష్టం! తండ్రిపోలికే కొడుక్కు వచ్చింది. మా వాడు పెరుగుకుండలు ఎన్ని పగలకొట్టాడో లెక్కలేదు. వాడు మంచినీళ్ళగ్లాసు గిరాటేస్తే జామ చెట్టుదగ్గిర పడేది" అంది శేషమ్మ.

"ఆ. చిన్నతనం" అంటూ రాజమ్మ లోపలికి పోయింది. శేషమ్మ అక్కడే కూచునివుంది. శివరాము లోపల్నించి వచ్చి పుస్తకం తీసుకుని గడగడా చదవటం మొదలుపెట్టాడు.

౨

కాంతారావు ఇంటికొచ్చేసరికి జగన్నాథం ఒకమూల కూచునివున్నాడు.

"అమ్మ ఏదిరా?" అన్నాడు కాంతారావు.

"వచ్చావు బాబూ!" అంటూ వచ్చింది శేషమ్మ. వెనకాలే కాంతారావుభార్యకూడా వచ్చింది.

"నాన్నతో చెప్పమంటావా?" అంది జగన్నాథంతల్లి.

"ఎలా నంగనాచిఅల్లే కూచున్నాడో చూడు! వొరేయి కాంతం! వీడితో వేగలేకుండావున్నాంరా. నువొక్కసారి వీడిని గట్టిగా భయంపెడితేగాని మరి మాటదక్కదు!" అంది శేషమ్మ.

"నన్నేం చెయ్యమంటావు?" అన్నాడు కాంతారావు.

"ఇవాళ వీడు వెంకట్రామయ్యగారి రిస్టువాచీ పగలగొట్టాడు. ఆయన లేనప్పుడు వాళ్ల రేడియో తిప్పుతుంటాడు. రాజమ్మగారు అనేకసార్లు అంది. ఆయన లేకపోతే ఆ రేడియో ముట్టుకోటానికి ఆయనభార్యకే భయం. వాళ్లింట్లో శివరాముమటుకు కుర్రాడు కాదూ? వాడేమన్నా ఇలాటిపనులు చేస్తున్నాడా?" అంది శేషమ్మ.

"ఆయనరిస్టువాచీ ఎందుకు పగలకొట్టావురా?" అన్నాడు కాంతారావు.

"పెట్టుకోమని ఆయన నాకిచ్చాడు నాన్నా!" అన్నాడు జగన్నాథం.

"వెధవా, అబద్ధాలు చెబుతా వెందుకు- నువ్వ అడిగితే ఇచ్చాడా, వూరికే ఇచ్చాడా?" అంది శేషమ్మ.

"నే నడిగితేనే ఇచ్చాడు!" అన్నాడు జగన్నాథం.

"ఎందుకు నువ్వాయన్ని అడగటం?" అంది శేషమ్మ.

"వాడు కుర్రాడు గదా, వా డడిగితే మాత్రం ఆయన ఇయ్యటం దేనికీ?" అన్నాడు కాంతారావు.

"ఇస్తే పగలగొట్టాలని వుందా?" అంది శేషమ్మ.

"ఎలా పగిలిందిరా" అన్నాడు కాంతారావు.

"మేము బిళ్లంగోడు ఆడుతున్నాం నాన్నా- బిళ్ల వచ్చి నాచేతికి తగిలింది-వాచి పగిలింది!" అన్నాడు జగన్నాథం.

"నీ ఈడుకు నీకు బిళ్లంగోడు దేనికిరా?" అంది శేషమ్మ.

"అదేమిటి అర్థంలేని మాట! వాడు ఏది చేసినా తప్పేనంటే ఎట్లా? అయితే పిల్లలు ఆడుకోరూ?" అన్నాడు కాంతారావు.

"పొద్దస్తమానం ఆటలేనా- ఆ స్కూలువాళ్లకన్నా బుద్ధిలేదు. పరీక్షలయింతర్వాత ఈ శలవలు దేనికి- వీళ్లు అల్లరి చెయ్యటానికి తప్పితే!" అంది శేషమ్మ.

"ఆటలో వెంకట్రామయ్యగారి నుదురు పగిలింది- అసలు కన్ను పోవలిసింది!" అన్నది కాంతారావు భార్య.

"ఆయ వెందు కున్నాడూ అక్కడ?" అన్నాడు కాంతారావు.

"ఆయనా ఆడాడు నాన్నా!" అన్నాడు జగన్నాథం.

"ఆడితే?" అంది శేషమ్మ.

"నేను బిళ్లని కొట్టబోతుండగా ఆయన పట్టుకుందామని దగ్గిరికి వచ్చి నిలబడ్డాడు. ఆ బిళ్ల వెళ్లి ఆయనముఖంమీద తగిలింది!" అన్నాడు జగన్నాథం.

"ఆయనకు వీడితో ఆటలేమిటి?" అన్నాడు కాంతారావు.

"బాగుందే! ఏదో కుర్రాడు గదా అని చనువు చేస్తే ఆయనముఖం పగలగొట్టమనీ, రిస్టువాచి పగలగొట్టమనీ, రేడియో పాడుచెయ్యమనీ వుందా ఏమిటీ? వాడిని నువ్వు కొంచెం హద్దులో పెడితే తప్ప మరి లాభం వుండదు" అంది శేషమ్మ.

"నేను వాడిని హద్దులో పెట్టేదేమిటి-మీరు పెట్టరాదూ?" అన్నాడు కాంతారావు.

"ఇందాకటినించీ నన్ను వాడెంత ధిక్కరించాడో నీకేం తెలుసు?" అంది శేషమ్మ.

"దీనికి నన్ను కోప్పడమంటే మటుకు నేనేం కోప్పడను? కుర్రవాడికి రిస్టువాచీ ఇయ్యటం ఆయన తప్పు."

"వీ డడగటం దేనికీ?"

"వాడు అనేకం అడుగుతాడు-వా డడిగినవన్నీ ఇస్తారా? అదైనా వాడిదగ్గిర పగిలిందికాని వాడు కాదు దాన్ని పగలగొట్టింది. ఆయనమొహం పగిలిందంటే వీడిది కాదు తప్పు. ఆటలో దెబ్బ అరటిపండు. పిల్లలతో ఆడుకోటానికి సిద్ధమయినవాడు దాని ఫలితానికికూడా సిద్ధం కావాలి. అనవసరంగా వాడిని కోప్పడమంటే మటుకు నేను కోప్పడను!"

"ఇలా అయితే మాట దక్కుతుందిట్రా వీడితో!" అంది శేషమ్మ.

"వాడిని ఇష్టంవచ్చినట్టు ఆడుకోనీయక వాడితో జోక్యం కలగచేసుకోవటం దేనికీ? ఆయన వీడితో ఆడుకోవటం దేనికీ? వీడికీ ఆయనకూ భేదం ఏమిటి? వాళ్ల శివరాముతో ఆయన ఎందుకు ఆడుకోడు?"

"వాళ్ల శివరాము ఇలాంటి పిచ్చిపను లేమీ చెయ్యడు!" అంది శేషమ్మ.

"పిచ్చిపను లని నీనమ్మకం-సరదా అని ఆయన అభిప్రాయం! ఇంతకూ ఆయనేమన్నా అన్నాడా వీ డిలా చేశాడని?"

"బాగుందిరా-ఆయన అంటాడేమిటి? వాళ్ల రాజమ్మ అంది!"

"ఆయనవాచీ పగిలినా ఆయనకు లేని దుగ్ధ ఆవిడకూ, నీకూ పట్టింది!" అన్నాడు కాంతారావు.

"సామ్మ కాదుట్రా-అలా అంటావేమిటి?" అంది శేషమ్మ.

"ఆయనకుమటుకు కాదూ సొమ్ము? ఆయన తన కొడుకుతో ఆడుకోలేక మనవాడితో ఆడుకుంటున్నాడు. చిన్నప్పుడు చిన్నతనంగా వుండకపోతే ఆ చిన్నతనం పెద్దప్పుడు ఇలాగే వస్తుంది! నేను వాళ్ల శివరాముతో ఆడుకుంటే నావాచీ పగిలితే నేనతన్ని ఏమీ అనను సరేగదా మనస్సులోకూడా అనుకోను!" అన్నాడు కాంతారావు.

"నువ్వు పిల్లల్ని దగ్గిరికి రానియ్యటం — నేను చూడటం!" అన్నది శేషమ్మ.

"అవును! వాళ్లని ఆడుకోనీక మనం దేనికి? వాళ్లతో ఆడుకోవాలంటే మనంకూడా వాళ్లతో సమానం అవాలి. అప్పుడు ఏం జరిగినా అనుకోవలిసిన అవసరమే లేదు. వాళ్ల శివరాముతో ఆయనకు ఆడుకోవాలని వున్నా ఆ శివరాముకు ఆయనతో ఆడుకోవాలని లేదల్లే వుంది. అందుకనే ఆయన మనవాడి దగ్గిరికి చేరాడు!" అన్నాడు కాంతారావు.

"వా డిలా అల్లరిచేస్తుంటే వాడిని భయం పెట్టకపోతే ఎలాగురా?" అంది శేషమ్మ.

"నువ్వింతమటుకు వాడి అల్లరి అల్లరి అని అనేకసార్లు చెప్పావు. తొమ్మిదేళ్లవాడు నలభైఏళ్ల వాడిమాదిరిగా ప్రవర్తించకపోవటం అల్లరి అని నీ నమ్మకం. పెద్దవాళ్లం మనమే చిలిపిచేష్టలు చేస్తూ, వెధవాలోచనలు మనస్సులో పెట్టుకుని మర్యాదస్థులమల్లే తిరుగుతుంటే చిన్నపిల్లలు ఏ కల్మషం లేక

వాళ్ల దారిని వాళ్లు ఆడుకుంటే మనం వోర్చలేకపోవట మేమిటి? పైగా ఇటువంటివాటికి నన్ను భయపెట్ట మంటావు. నాకొడుక్కు నాయందు భయమూ, భక్తీ కావు నాకు కావలిసింది. నాయందు వాడికి కొంచెం అభిమానమూ, ప్రేమా వుంటే చాలు. నువ్వు చెప్పినట్టు చేస్తే వీడూ శివరాముఅల్లే తయారయ్యేవాడు. శివరాము ఎంత మంచివాడయినా అటువంటి కొడుకు మటుకు నా కక్కర్లేదు. అటువంటి కొడుకే నాకూ వుంటే నేనూ వాళ్ల నాన్నకుమల్లే ఆడుకోటానికి ఎవరినన్నా వెతుక్కోవాలి!"

"నన్ను వీడు నాయనమ్మగారూ అని పిలవటం మొదలుపెట్టాడు — కొత్తవిద్య కామాలు!" అంది శేషమ్మ.

కాంతారావు నవ్వాడు.

"ఇందాకటి విషయాలన్నీ అయిపోయినయి కామాలు. నన్ను నాన్నగారూ అని పిలిస్తే కోప్పడితే వాడిని వెనకేసుకునివస్తివే ఆనాడు? ఇప్పుడు నిన్ను నాయనమ్మగారూ అని పిలవటం నీ కిష్టం లేదు కామాలు—తమాషే!"

"ఏడీ మీ జగ్గన్నాడా?" అంటూ లోపలికి వచ్చాడు వెంకట్రామయ్య.

"రండి!" అన్నాడు కాంతారావు.

"ఏడీ మీవాడు?" అన్నాడాయన.

"మా వాడు చాలా అల్లరి చేస్తున్నాట్టే!" అన్నాడు కాంతారావు ఆయన మొఖంమీద పట్టిచూచి.

"భలేవాడండీ మీవాడు. నామీద నలభై పిల్లీలు ఎక్కించాడు. ఏడీ ?"

"మీ గడియారం పగిలిందిట?"

"వెధవగడియారం — ఇంకోటి వస్తుంది!" అన్నాడు వెంకట్రామయ్య.

"వాడిని పిలవ్వే!" అని కాంతారావు అంటూండగానే జగన్నాథం లోపలికి వచ్చాడు.

"రావోయి సినిమా కెళదాం!" అన్నాడు వెంకట్రామయ్య.

"వాడు మీతో సినిమా కేమిటి?" అంది శేషమ్మ.

"పర్వా లేదు! మీవాడిని పంపించాలండీ!" అన్నాడు కాంతారావుతో వెంకట్రామయ్య.

కాంతారావు జగన్నాథంవంక చూచాడు. జగన్నాథందృష్టి అంతా తండ్రిమీదనే వుంది.

"వెళ్తావుట్రా?" అన్నాడు కాంతారావు.

'సై' అన్నట్టుగా తల వూపాడు జగన్నాథం.

"అయితే వెళ్లు!" అన్నాడు కాంతారావు.

జగన్నాథం ఒక్క పరుగు తీశాడు బైటికి.

"వోరేయి వెధవా— ఆ మట్టిమొఖం అదీ కడుగుతా రారా" అంది శేషమ్మ.

"నాకొద్దు!" అన్నాడు జగన్నాథం.

"చూడరా—అదీ వరస!" అంది శేషమ్మ.

శేషమ్మ బలవంతంగా జగన్నాథాన్ని పట్టుకుని, అతను గిజగిజా కొట్టుకుంటున్నా తీసుకువెళ్లి, మొఖం కడిగి, తల దువ్వి, ఇస్త్రీబట్టలు తొడుగుతుంటే కాంతారావుకు నవ్వు వచ్చింది. ఏదో అందామని వెంకట్రామయ్యవంక తిరిగాడు.

వెంకట్రామయ్య అలాగే నిలబడి జగన్నాథంవంకనే చూస్తున్నాడు. అతని ముఖంలో వర్ణనాతీతమైన వుత్సాహం తాండవమాడుతున్నది. కాంతారావు ఆశ్చర్యపోయినాడు.

జగన్నాథం వెంకట్రామయ్యతో వెళ్లింతరువాత "పాపం, ఆయన ఎంత బాధపడుతున్నాడో ఇప్పుడు-చిన్నతనంలో చిలిపిచేష్టలు చెయ్యకపోవడం వల్ల!" అన్నాడు కాంతారావు భార్యతో.